
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి

3

మెదక్

జిల్లాల వార్తలు


సోమవారం 8 సెప్టెంబరు 2025

మరమ్మతులేవి?

- వరదలకు కొట్టుకుపోయిన రోడ్లు, కల్వర్టులు 4
- పనుల్లో జాప్యంతో పరేషాన్
- రామాయంపేట, నిజాంపేట మండలాల్లో సమస్యలు

కోహీర్ పట్టణం.. అభివృద్ధికి దూరం

- మున్సిపాలిటీగా మారినా తీరని కష్టాలు
- అధ్వానంగా మురుగు కాలువలు
- బురదమయంగా రోడ్లు 4
- రెగ్యులర్ కమిషనర్ లేక అస్తవ్యస్తం



గణేశ్ నిమజ్జన వేడుకల్లో జగ్గారెడ్డి జోష్

రూ.18 లక్షలకు చైతన్య యూత్ లడ్డు దక్కించుకున్న జయాచైతన్యరెడ్డి

ఇటు ట్రాఫిక్ నియంత్రణ.. అటు మహబూబ్‌సాగర్ కట్టపై నిమజ్జనంలో తెల్లవారుజాము వరకు జగ్గారెడ్డి బిజీబిజీ

సంగారెడ్డి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణంలో జరిగిన గణేశ్ నిమజ్జన వేడుకల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి జోష్ కనబరిచారు. స్వయంగా దగ్గరుండి నిమజ్జన వేడుకలను పర్యవేక్షిస్తూ పట్టణంలో ట్రాఫిక్‌జాం కాకుండా చర్యలు చేపట్టారు. ఆదివారం తెల్లవారుజాము నాలుగు గంటల వరకు మహబూబ్‌సాగర్ చెరువు కట్టపై వినాయక విగ్రహాల నిమజ్జనాలను పర్యవేక్షించారు. జగ్గారెడ్డి కూతురు జయాచైతన్య రెడ్డి దంపతులు స్థానిక చైతన్యయూత్ లడ్డూ వేలంలో రూ. 18లక్షలకు దక్కించుకొని అక్కడికక్కడే భక్తులకు పంచారు.









సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

పెన్షన్లు పెంచేదెప్పుడు..?

ప్రతిపక్షాలు ప్రశ్నించాలి : మందకృష్ణ మాదిగ

రామచంద్రాపురం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కారు అధికారంలోకి వచ్చి 21 నెలలు గడుస్తున్నా సామాజిక పింఛన్లు పెంచకుండా మాట తప్పిందని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం కొల్లూరులో ఆదివారం వికలాంగులు, వితంతువులు, వృద్ధుల మహాగర్జన సన్నాహక సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మందకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ఎవరో ఒక సామాజికవర్గం వారు మాత్రమే ఓట్లు వేస్తే గెలువలేదన్నారు. నిరుపేదలైన 55లక్షల మంది పింఛన్‌దారులు ఓట్లు వేస్తే గెలిచిందని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లకు దగ్గరవుతున్నా పింఛన్ పెంచడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హామీలు నెరవేర్చకపోతే ప్రశ్నించాల్సిన బాధ్యత ప్రతిపక్షాలపై ఉంటుందన్నారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ ఫాంహౌస్‌కు పరిమితం కావడం సరికాదని హితవు పలికారు. పింఛన్లు పెంచకపోతే ఉద్యమిస్తామని, విజయవాడ రహదారిని నిర్బంధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వై.ప్రమోద్ మాదిగ, వీఎస్‌రాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలు

రూ.175 కోట్లు

మూడు వారాల్లో చెల్లించాలని మిల్లర్లకు నోటీసులు

గడువు మీరితే పీడీ కేసులు

మంత్రివర్గ సమావేశంలో తీర్మానం

త్వరలో జీవో విడుదల చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు

మెదక్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అక్రమాలకు పాల్పడే రైస్ మిల్లుల పట్ల కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొందరు మిల్లర్ల తీరు వల్ల రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రం తప్పుబట్టే పరిస్థితి తలెత్తుతున్నది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కొరడా ఝులిపించేందుకు సిద్ధమైంది. బియ్యం ఇవ్వని మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టాలని, వాటి నుంచి సీఎంఆర్‌కు సమానమైన డబ్బును రీకవరీ చేయాలని నిర్ణయం తీసుకుంది. మూడేళ్లుగా ధాన్యం బకాయిలు చెల్లించని రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలని, పీడీ కేసులు నమోదు చేయాలని రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తీర్మానించింది.



ధాన్యం కొనుగోలు కేంద్రం (ఫైల్)


అంచనాలకు మించి దిగుబడులు

2022-23 యాసంగి సీజన్‌లో కస్టమ్ మిల్లింగ్ కోసం ధాన్యాన్ని మిల్లర్లకు కేటాయించారు. చేశారు. అంచనాలకు మించిన ధాన్యం దిగుబడులు రావడంతో మిగిలిన ధాన్యాన్ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ వేలం వేశారు. రాష్ట్ర వ్యాప్తంగా బండారీ ఏజెన్సీ కాంట్రాక్టును దక్కించుకుంది. అయితే, మిల్లర్లు కాంట్రాక్టర్‌కు ధాన్యం ఇవ్వకుండా మార్కెట్‌కు తరలించినట్లు ఆరోపణలు వచ్చాయి. మిల్లర్లు ధాన్యం బకాయిల విషయంలో గత ప్రభుత్వం ఉదారంగా వ్యవహరించడం కూడా కారణం కావచ్చునని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇటీవల సమావేశమైన మంత్రివర్గం ధాన్యం బకాయిలు చెల్లించని మిల్లర్లపై సీరియస్ చర్యలకు పూనుకున్నారు.

మెదక్ జిల్లాలో రూ.175 కోట్లు


రైతుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా పౌరసరఫరాలశాఖ సేకరిస్తుంది. ఆ ధాన్యాన్ని రైస్ మిల్లులకు పంపుతుంది. మిల్లర్లు ఆ ధాన్యాన్ని మిల్లింగ్ చేసి బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించాల్సి ఉంటుంది. 2022-23 యాసంగి సీజన్‌లో ధాన్యం దిగుబడులు అంచనాలకు మించి రావడంతో కస్టమ్ మిల్లింగ్‌కు పోనూ మిగిలిన ధాన్యం రైస్ మిల్లుల్లో ఉండిపోయాయి. వాటిని ప్రభుత్వం వేలం వేసింది. మెదక్ జిల్లా వ్యాప్తంగా 72 రైస్‌మిల్లుల్లో 87,986 మెట్రిక్ టన్నుల ధాన్యం మిగిలిపోయింది. ఆ ధాన్యాన్ని ఇప్పటికీ కాంట్రాక్టర్‌కు చెల్లించలేదు. పలువురు మిల్లర్లు నాణ్యమైన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి బియ్యాన్ని అమ్ముకున్నారని ఆరోపణలు

మిగతా 6వ పేజీలో











సంగారెడ్డి పట్టణంలో సంపూర్ణ చంద్ర గ్రహణం దృశ్యాలు

- సంగారెడ్డి ఫొటోగ్రాఫర్



మత్స్య సంఘాల డిజిటలైజేషన్

మత్స్యకారుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపర్చేందుకు చర్యలు

సంగారెడ్డి జిల్లాలో 234 సంఘాలు, 12,889 మంది సభ్యులు

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని మత్స్య సహకార సంఘాలను కేంద్ర ప్రభుత్వం డిజిటలైజేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే మత్స్య సహకార సంఘాల్లో సభ్యత్వాల కోసం దరఖాస్తు ప్రక్రియను ఆన్‌లైన్ విధానంలో చేపట్టింది. సహకార సంఘాల ద్వారా మత్స్యకారుల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడంతో పాటు మత్స్యరంగాన్ని ఆధునికీకరించడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తున్నది

అర్హులకే పథకాలు

మత్స్య సహకార సంఘాల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతీ ఏటా వివిధ పథకాలను అమలు చేస్తున్నాయి. సంక్షేమ పథకాలు పక్కదారి పట్టకుండా అర్హులైన లబ్ధిదారులకు చేరేందుకే ఈ డిజిటలైజేషన్ ప్రక్రియను చేపట్టింది. చేప పిల్లల పంపిణీ, వలలు, తెప్పలు, ద్విచక్ర వాహనాలు, మార్కెటింగ్ సదుపాయాలతో పాటు వివిధ పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్నాయి. మత్స్య సహకార సంఘల్లో ఎంతమంది సభ్యులు ఉన్నారనే వివరాలను ముందుగానే తెలియడంతో ప్రభుత్వం నుంచి అంతమేర నిధులు కేటాయించి ఖర్చు చేయనున్నారు. సభ్యులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా అధికారులు ఇప్పటికే అవగాహన కల్పిస్తున్నారు.

ఎన్‌ఎఫ్‌డీపీ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్

సంగారెడ్డి జిల్లాలో మొత్తం 234 మత్స్య సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో 12,889 మంది సభ్యులు నమోదు చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా నేషనల్ ఫిషరీష్ డిజిటల్ ప్లాట్ (ఎన్‌ఎఫ్‌డీపీ) ఫామ్ పోర్టల్‌లో కామన్ సర్వీస్ సెంటర్లలో రిజిస్ట్రేషన్ చేసుకునే

మిగతా 6వ పేజీలో



సర్దుబాటుకు టీచర్లు కావలెను?

పదోన్నతులతో భారీగా ఏర్పడ్డ ఎస్జీటీ ఖాళీలు

ఇంకా కొలిక్కి రాని టీచర్ల సర్దుబాటు

ఈ వారంలో ప్రక్రియ పూర్తికి చర్యలు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు ఇంకా కొలిక్కి రాలేదు. ఉపాధ్యాయుల పదోన్నతులు పూర్తికావడంతో గత నెలలో పెద్ద సంఖ్యలో సెకండరీ గ్రేడ్ టీచర్ ఖాళీలు ఏర్పడ్డాయి. ఉపాధ్యాయులు అవసరమున్నచోట సమీప పాఠశాలల నుంచి టీచర్లను సర్దుబాటు చేయాలని, ఈ ప్రక్రియ ఈ నెల 4వ తేదీ వరకు ప్రక్రియ పూర్తిచేయాలని పాఠశాల విద్యాశాఖ డీఈవోలను ఆదేశించింది. కానీ ఈ ప్రక్రియ ఆలస్యమవుతున్నది. అయితే, ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించి ఇప్పటికే ఎంఈవోల ద్వారా వివరాలను జిల్లా అధికారులు సేకరించారు.

190 మంది ఎస్జీటీలకు పదోన్నతి

గత నెల 26న జరిగిన పదోన్నతుల్లో జిల్లాలో 190 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి లభించింది. పదోన్నతి పొందినవారు పదిహేను రోజుల్లో కేటాయించిన పోస్టింగ్‌కు వెళ్లి రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం గడువు విధించింది. ఇందుకు మరో రెండు రోజులు మాత్రమే మిగిలి ఉన్నది. ఈ నేపథ్యంలో ఎంత మంది పదోన్నతిపై రిపోర్ట్ చేశారనే విషయంపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నది. దీనికి అనుగుణంగా ఎస్జీటీల ఖాళీలపై స్పష్టత రానున్నది. ఇప్పటివరకు స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి పొందిన 190 మందిలో 55 మంది మాత్రమే రిపోర్ట్ చేశారని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. అయితే జిల్లాలో ఎంతమంది టీచర్లను సర్దుబాటు చేయాలన్న దానిపై మరో రెండు రోజుల్లో ఓ క్లారిటీ వచ్చే అవకాశం ఉన్నది.

రెండు నెలల్లో రెండోసారి

గత జూలై నెలలో మొదటి విడతలో 342 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేసిన విషయం తెలిసిందే. తాజాగా రెండో విడతలో సుమారు 60 మంది వరకు టీచర్లను సర్దుబాటు చేసే అవకాశముందని ఆ శాఖ వర్గాలు వివరించాయి. అయితే పదోన్నతులతో జిల్లాలో 637 ఎస్జీటీ ఖాళీలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఎస్జీటీల ఖాళీలు భారీగా ఏర్పడడంతో టీచర్లను ఎక్కడి నుంచి సర్దుబాటు చేయాలన్న దానిపై విద్యాశాఖ మల్లగుల్లాలు పడుతున్నట్టు తెలుస్తోంది. ఏదేమైనప్పటికీ ఈ వారంలో టీచర్ల సర్దుబాటు ప్రక్రియ పూర్తిచేసేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

విభాగాలు సరే.. సిబ్బంది జాడేది?

సెక్యూరిటీ, పేషెంట్ కేర్, శానిటేషన్ సిబ్బంది భర్తీలో జాప్యం

పూర్తిస్థాయి నియామకంతోనే రోగులకు ప్రయోజనం

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి వచ్చే రోగులకు డాక్టర్లు, వైద్య సిబ్బంది సకాలంలో స్పందించి వైద్య సేవలందిస్తున్నారు. ప్రజలకు సత్వర, నాణ్యమైన వైద్య సేవలందించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం కార్పొరేట్‌కు దీటుగా సర్కారు దవాఖానాలను మెరుగుపరుస్తున్నది. జిల్లాల్లోనే 90 శాతం వైద్య చికిత్సలు అందాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం సర్కారు దవాఖానాల్లో వివిధ యూనిట్లను నెలకొల్పుతూ వస్తున్నది. ఇందులో భాగంగానే రెండు రోజుల కిందట సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి ప్రాంగణంలోనే క్రిటికల్ కేర్ విభాగాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆస్పత్రుల భవనాల నిర్మాణాలు, రోగులకు వైద్య సేవలందించడం వరకు బాగానే ఉన్నప్పటికీ.. రోగుల భద్రత, రోగుల సంరక్షణతో పాటు ఆస్పత్రులు శుభ్రంగా ఉండాలంటే పారిశుధ్య సిబ్బంది నియామకం అత్యవసరం. సంగారెడ్డి జనరల్ ఆస్పత్రికి నిత్యం సుమారు 1,700 మంది ఔట్ పేషెంట్, 450 మంది ఇన్‌పేషెంట్‌లు వైద్య సేవలు పొందుతుంటారు. అయితే సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో సెక్యూరిటీ, పేషెంట్ కేర్, శానిటేషన్ సిబ్బంది కలిపి సుమారు 250 మంది పనిచేస్తున్నారు. తాజాగా ఈ ఆస్పత్రి ప్రాంగణంలోనే 50 పడకల క్రిటికల్ కేర్ విభాగంతో పాటు మెడికల్ కాలేజీ హాస్టల్స్, అదనపు భవనాలు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో అదనంగా సెక్యూరిటీ, పేషెంట్ కేర్, శానిటేషన్ సిబ్బందిని నియమించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. మెడికల్ కాలేజీ, ఆస్పత్రి పరిశుభ్రత, భద్రతను దృష్టిలో ఉంచుకొని ఆస్పత్రి అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే వైద్యేతర సిబ్బందిని నియమిస్తే అన్ని విధాలా ప్రయోజనం ఉంటుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.



సంగారెడ్డి జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలోని క్రిటికల్ కేర్ విభాగం

పరిహారం చెల్లింపుపై రౌండ్‌టేబుల్ సమావేశం

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సిగాచి బాధిత కుటుంబాలకు పూర్తి పరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ, ప్రజాఉద్యమాల జాతీయ వేదిక, మానవ హక్కుల వేదిక, అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ సంస్థలు సంయుక్తంగా 9న రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు టీపీజేఏసీ జిల్లా కన్వీనర్ వై.అశోక్ కుమార్, కో కన్వీనర్ కన్నెగంటి రవి ఒక ప్రకటనలో తెలిపారు. ముత్తంగిలోని పీఎస్ఆర్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి టీపీజేఏసీ రాష్ట్ర కన్వీనర్ ప్రొ.హరగోపాల్, మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, ఎమ్మెల్సీ కోదండరామ్, తదితర ముఖ్యులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.



పాపన్నపేటలో పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ అర్బన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో రూ. 5కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. వివిధ దశల్లో కొనసాగుతున్న పనులను గడువు లోపు పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

పాపన్నపేట, సెప్టెంబర్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందజేస్తున్నామని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. పాపన్నపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం ఆయన తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాటించాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు.

ఆ మూడు గ్రామాలపై

తెగని పంచాయితీ

రంగంలోకి జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ

విలీనం చేయాల్సిందే అంటూ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పట్టుదల

ప్రత్యామ్నాయ మార్గాలపై అధికారుల అన్వేషణ

పటాన్‌చెరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు నియోజకవర్గంలో నూతన పురపాలక సంఘాల ఏర్పాటు చిచ్చురేపింది. భానూరు, నందిగామ, క్యాసారం గ్రామాల విషయంలో పీటముడి పడింది. మూడు గ్రామాల విషయంలో కాంగ్రెస్ నాయకులు మంత్రి, ఎమ్మెల్యే వర్గాలుగా చీలిపోయారు. ఈ పంచాయితీ తీర్చడానికి ప్రత్యేక పురపాలక సంఘంగా ఏర్పాటు చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. భానూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ ప్రధాన నాయకులు మంత్రి దామోదర్ రాజనర్సింహ వద్ద చక్రం తిప్పుతున్నారు. ఈ విషయంపై తర్జనభర్జనల అనంతరం చివరకు మూడు గ్రామాలతో పురపాలక సంఘాన్ని ఏర్పాటు చేయాలని శుక్రవారం పురపాలకశాఖ కార్యాలయం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కలెక్టర్ కార్యాలయం నుంచి నివేదిక పంపారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా మూడు గ్రామాల్లో 15,250 మంది జనాభా ఉన్నారని పేర్కొన్నారు. గత 14 సంవత్సరాల్లో జనాభా భారీగా పెరిగిందని, భానూరు, నందిగామ గ్రామాల్లో అనేక కొత్త కాలనీలు వెలిసిన నేపథ్యంలో 25 వేల జనాభా ఉండే అవకాశం ఉందని అధికారులు లెక్కలు వేస్తున్నారు. క్యాసారంలో 2,752 మంది ఉన్నట్టు లెక్కల్లో చూపించారు.



పటాన్‌చెరు ఎంపీడీవో కార్యాలయం



నర్సాపూర్‌లోని పోస్టాఫీసు సమీపంలో ఉన్న పాఠశాలలో నేర్చుకుంటున్న విద్యార్థులు

ప్రభుత్వ బడుల్లో ఏఐ బోధన

మెదక్ జిల్లాలో ఆరు పాఠశాలల్లో ప్రారంభం

మెదక్/నర్సాపూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా గ్రామీణ విద్యార్థులకు చిన్నప్పటి నుంచే సాంకేతిక విద్యను అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెడుతోంది. ఈ క్రమంలో మెదక్ జిల్లాలో మొత్తం 21 పాఠశాలలను ఎంపిక చేయగా, మొదటి విడతలో ఆరు పాఠశాలల్లో ఈ బోధనను ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ప్రస్తుతం నర్సాపూర్, తూప్రాన్, కాళ్లకల్, బూర్గుపల్లి, నిజాంపేట, మాసియపేట పాఠశాలల్లో 3, 4, 5 తరగతుల విద్యార్థులకు ఏఐ విద్యను అందిస్తున్నారు.

విద్యార్థుల్లో ఆసక్తి

విద్యార్థులను ఆకట్టుకునేలా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో ఏఐ బోధన కొనసాగుతోంది. వారానికి నాలుగు రోజులు ఏఐ ద్వారా డిజిటల్ లిటరసీ, తెలుగు, గణితం వంటి అంశాలపై కంప్యూటర్ ద్వారా శిక్షణ ఇస్తున్నారు. నర్సాపూర్‌లోని పోస్టాఫీసు సమీపంలోని పాఠశాలలో బెంగుళూరుకు చెందిన ఈకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏఐ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ బోధన పట్ల విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారని, గతంలో బడికి రావడానికి ఇష్టపడని వారు ఇప్పుడు ఉత్సాహంగా వస్తున్నారని ఉపాధ్యాయులు తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారులు కూడా ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ, గ్రామీణ విద్యార్థులకు ఆధునిక విద్యను అందించేందుకు కృషి చేస్తున్నారు.

కోహీర్ పట్టణం.. అభివృద్ధికి దూరం

- ముస్సిపాలిటీగా మారినా తీరని కష్టాలు
- రెగ్యులర్ కమిషనర్ లేక అస్తవ్యస్తం
- అధ్వానంగా మురుగు కాలువలు, బురదమయంగా రోడ్లు



కోహీర్‌లోని జహంగీర్‌వాడ కాలనీలో మట్టి రోడ్డుపైనే పారుతున్న మురుగు నీరు

కోహీర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీగా మారితే తమ గ్రామం అభివృద్ధి చెందుతుందని కోహీర్ ప్రజలు ఆశించారు. జనవరి 27న కోహీర్‌ను ప్రభుత్వం కొత్త మున్సిపాలిటీగా ఏర్పాటు చేసింది. కానీ, పూర్తిస్థాయి అధికారులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ప్రజల ఆశలు అడియాశలయ్యాయి. రెగ్యులర్ మున్సిపల్ కమిషనర్ లేకపోవడంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. దీంతో ప్రజలు ప్రభుత్వం, అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అలసత్వంపై విమర్శలు

మున్సిపాలిటీ ఏర్పాటు చేసినప్పటి నుంచి పూర్తిస్థాయి మున్సిపల్ కమిషనర్‌ను నియమించకపోవడం వల్ల సమస్యలు పేరుకుపోయాయి. ఇప్పటివరకు నలుగురు ఇన్‌చార్జి కమిషనర్లు వచ్చినా, ఎవరూ కొన్ని నెలలకు మించి విధులు నిర్వహించకుండా బదిలీలపై వెళ్లిపోయారు. ప్రస్తుతం జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్ సుభాష్ రావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే, ఆయన సమయానికి అందుబాటులో ఉండకపోవడంతో ప్రజలు నిరాశతో వెనుదిరుగుతున్నారు.

పట్టణంలో సమస్యల తిష్ఠ

కోహీర్ పట్టణంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. మురుగు కాలువలు అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లన్నీ బురదమయంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీల్లో వీధిలైట్లు సక్రమంగా లేకపోవడంతో రాత్రి వేళల్లో భయాందోళనలు నెలకొన్నాయి. అలాగే, తాగునీటి సరఫరా కూడా సక్రమంగా లేదని వివిధ కాలనీల ప్రజలు వాపోతున్నారు.

అధికారుల అలసత్వంతోనే

స్థానిక నాయకులు, ప్రజలైన ఎంఏ. ఖలీమ్, ఫిర్దోస్ మున్సిపాలిటీ సమస్యలపై స్పందించాలని జిల్లా ఉన్నతాధికారులను కోరారు. కోహీర్ అభివృద్ధి కోసం వెంటనే రెగ్యులర్ మున్సిపల్ కమిషనర్‌ను నియమించాలని, అప్పుడే సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందని వారు పేర్కొన్నారు. అధికారుల అలసత్వం వల్ల ప్రజలు నిరాశ చెందుతున్నారని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టిలో పెట్టుకొని చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.





మరమ్మతులకు నోచని నిజాంపేట-నస్కల్ రహదారి, రామాయంపేట - నిజాంపేట హైవేలోని రోడ్డు క్లోజ్ అని పోసిన మట్టి

మరమ్మతులేవి?

- వరదలకు తెగిన రోడ్లు, కల్వర్టులు
- రామాయంపేట, నిజాంపేట మండలాల్లో సమస్యలు
- పనుల జాప్యంతో పరేషాన్
- అంతర్ జిల్లా సరిహద్దు వాసులకు తప్పని కష్టాలు

రామాయంపేట/నిజాంపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తెగిపోయిన రోడ్లు, కల్వర్టుల నిర్మాణంలో జరుగుతున్న జాప్యం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. పనుల్లోని నిర్లక్ష్యం కారణంగా ప్రజలు అత్యవసరాల కోసం అధిక దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో సమయం, డబ్బు వృథా అవుతున్నాయని అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

తెగిపోయిన కల్వర్టులు, రోడ్లు

రామాయంపేట, నిజాంపేట మండలాల్లోని నస్కల్, పర్వతాపూర్, చల్మెడ, ధర్మారం, లక్ష్మాపూర్ స్టేషన్ రోడ్లపై ఉన్న కల్వర్టులు వరద ఉధృతికి దెబ్బతిన్నాయి. పన్నెండు రోజుల క్రితం వరదలకు దెబ్బతిన్న ఈ రోడ్ల మరమ్మతులు ఇంకా ప్రారంభం కాలేదు. దీంతో మెదక్, కామారెడ్డి జిల్లాల సరిహద్దు వాసులకు కష్టాలు తప్పడం లేదు. ముఖ్యంగా నిజాంపేట - నస్కల్ రోడ్డుపై నిత్యం రాకపోకలు సాగించే ఉద్యోగులు, కూలీలు, సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చల్మెడ - నిజాంపేట పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయి. అదేవిధంగా రామాయంపేట మండల పరిధిలోని పర్వతాపూర్‌కు వెళ్లే రహదారి కల్వర్టు తెగిపోవడంతో ఆరు గ్రామాల ప్రజలు, తండావాసులు పట్టణాలకు వెళ్లలేకపోతున్నారు.

అధికారుల పర్యవేక్షణ కరువు

కలెక్టర్ రాహుల్‌రాజ్ ఈ ప్రాంతాలను పర్యవేక్షించి, తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించినప్పటికీ పనుల్లో జాప్యం కొనసాగుతోంది. రోడ్డు కృంగిపోయి క్లోజ్ చేసిన నిజాంపేట మండలంలోని 765 డీజీ హైవేపై కూడా వాహనదారులు ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి మరమ్మతు పనులు పూర్తి చేసి, రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచాలని రామాయంపేట, నిజాంపేట మండలాల ప్రజలు కోరుతున్నారు.



రామాయంపేట-నిజాంపేట మధ్యలో కుంగిన రోడ్డుపై వాహనదారుడి తిప్పలు

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

- జోగిపేట వద్ద రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు
- గిరిపల్లిలో గుర్తుతెలియని వాహనం ఢీకొని బాలుడు
- చేగుంటలో కారు చెట్టును ఢీకొనడంతో యువకుడి దుర్మరణం







బైకును ఢీకొన్న కారు, మృతిచెందిన నర్సింలు(ఇన్‌సెట్‌లో), గిరిపల్లిలో సంఘటన స్థలంలోనే మృతి చెందిన హర్షిత్

జోగిపేట/గజ్వేల్ రూరల్/చేగుంట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో వృద్ధుడు, బాలుడు, యువకుడు మృతి చెందగా, నలుగురికి గాయాలైన ఘటనలు ఆదివారం చోటుచేసుకున్నాయి. సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం సంగూర్‌పేట వద్ద 161 జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో సింగూర్ గ్రామానికి చెందిన కుమ్మరి నర్సింలు (60) తన కుమారుడు బాబుతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ఘటనలో నర్సింలు అక్కడికక్కడే మృతి చెందగా, బాబుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరో ఘటనలో, గజ్వేల్ మండలం గిరిపల్లిలో రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామానికి చెందిన జలా హర్షిత్ (10) గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో దుర్మరణం చెందాడు. హర్షిత్ తన తల్లిదండ్రులతో కలిసి గిరిపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మెదక్ జిల్లా చేగుంట మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామ శివారులో కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా, నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. రామాయంపేట మండలం శివాయపల్లి గ్రామానికి చెందిన కుటుంబం చేగుంట మండలం కర్నాల్‌పల్లి రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఆదివారం విందు నిర్వహించుకున్నారు. రాత్రి స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా అనంతసాగర్ శివారులో ప్రమాదవశాత్తు కారు చెట్టుకు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో రామోల్లా సాయితేజగౌడ్(23) తీవ్రంగా గాయపడగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. పల్లె స్వామి, గుర్రం తేజగౌడ్, పెండల ప్రణయ్, చాకలి నరేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన వారిని తూప్రాన్ ఆసుపత్రికి తరలించారు. చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి ఘటన స్థలానికి పంచనామ నిర్వహించి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



సురేష్(ఫైల్)

హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం హుస్నాబాద్ పరిధిలో చోటుచేసుకున్నది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామానికి చెందిన నమిలికొండ సురేష్ (28) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల భార్య అనారోగ్యం కారణంగా చికిత్స కోసం రూ.4 లక్షల వరకు అప్పులు చేశాడు. ఆటో ద్వారా ఆదాయం లేకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలనే దిగులుతో ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కూలీ పనికి వెళ్లిన భార్య రమాదేవి ఇంటికి తిరిగి వచ్చి చూడగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. రమాదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. సురేష్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారు.



ఎక్స్‌కవేటర్‌తో పూడ్చివేయిస్తున్న బుంగ

వెంకట్రావ్‌పేటలో బుంగ పడిన వనం చెరువు

తొగుట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తొగుట మండలం వెంకట్రావ్‌పేటలోని వనం చెరువు మత్తడి వద్ద శనివారం సాయంత్రం బుంగ పడింది. దీంతో నీరు వృథాగా పోతుండగా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి ఇరిగేషన్ డీఈఈ శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ శ్రీకాంత్ దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకుని గడ్డికట్టలు వేసినప్పటికీ నీటి ప్రవాహం ఆగలేదు. దీంతో జేసీబీని తెప్పించి, రైతులు, లస్కర్‌ల సహాయంతో మట్టి, గడ్డికట్టలతో బుంగను పూడ్చివేశారు.


సిద్దిపేట కోమటిచెరువులో నిమజ్జనమవుతున్న గణపయ్య


సిద్దిపేటలో నిమజ్జనానికి వరుస కట్టిన వినాయక వాహనాలు


నారింజ ప్రాజెక్టుకు నిమజ్జనానికి తరలిన జహీరాబాద్ విగ్రహాలు




మనోహరాబాద్ మండలం దండుపల్లిలో నిమజ్జనానికి తరలిన గణపతి

మెదక్‌లో నిమజ్జనానికి తరలిన పిట్లంబేస్ వీధి గణనాథుడు


రామాయంపేటలో

బై బై గణేశా

రెండో రోజు సందడి.. మధ్యాహ్నం తర్వాత ముగిసిన నిమజ్జనం

జహీరాబాద్/సంగారెడ్డి/సిద్దిపేట/దుబ్బాక/రామాయంపేట/మనోహరాబాద్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భక్తిశ్రద్ధలతో పదకొండు రోజులు పూజలందుకున్న గణనాథులకు ఘనంగా వీడ్కోలు పలికారు. వినాయక నిమజ్జనాలు ఉత్సాహభరిత వాతావరణంలో ముగిశాయి. శనివారం సాయంత్రం ప్రారంభమైన శోభాయాత్రలు ధగధగలాడే విద్యుత్‌కాంతుల అలంకరణ, డప్పుచప్పుల దరువుతో సందడిగా సాగాయి. చిన్నాపెద్ద, యువత చిందుల మధ్య అర్ధరాత్రి తర్వాత ప్రధాన రోడ్లపైకి చేరుకోగా, ఆదివారం ఉదయం నిమజ్జనానికి బారులు తీరాయి. జహీరాబాద్‌లో నారింజ ప్రాజెక్టులో 50 విగ్రహాలు నిమజ్జనమయ్యాయి. సంగారెడ్డిలో మధ్యాహ్నం వరకు కొనసాగగా, మహబూబ్‌సాగర్ చెరువులో సుమారు 148 విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు మున్సిపల్ సిబ్బంది తెలిపారు. రామాయంపేట, మనోహరాబాద్‌లలో రెండో రోజు హంగామాగా విగ్రహాలను నిమజ్జనం చేశారు. దుబ్బాకలో మధ్యాహ్నం వరకు నిమజ్జనం పూర్తికాగా, సిద్దిపేట పట్టణంలో ఆదివారం సాయంత్రం వరకు సాగింది. కోమటిచెరువు, ఎర్రచెరువుకు మధ్యాహ్నం తర్వాత విగ్రహాల వాహనాలు వరుస కట్టాయి. క్రేన్‌ల సహాయంతో ఒక్కో విగ్రహాన్ని నిమజ్జనం చేసే వరకు సాయంత్రమైంది. నిమజ్జనం ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. సిద్దిపేట పట్టణంలో పలు చోట్ల విగ్రహాలను ఇంకా గణనాథులకు ఉద్వాసన పలకలేదు. ఆదివారం రాత్రి గ్రహణం ఉండడంతో ముందే కలశం మాత్రమే కదిలించి, మండపాలకు నల్లటి పరదాను కప్పి ఉంచారు.

లడ్డూలకు రికార్డు ధరలు

నారాయణఖేడ్/తూప్రాన్/కల్హేర్/సిర్గాపూర్/తొగుట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రోత్సవాల సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలం పాటల్లో భక్తులు పోటీపడి రికార్డు స్థాయి ధరలకు దక్కించుకున్నారు. మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలోని సాయినగర్ కాలనీలో స్టార్ వార్స్ వినాయకుడి లడ్డూ వేలం పాటలో పల్లెర్ల బాలేశ్‌గుప్తా రూ.1.95 లక్షలకు దక్కించుకున్నారు. ఆర్యవైశ్య సంఘం వినాయకుడి లడ్డూను నాగిళ్ల రాజు రూ. 1.41 లక్షలకు పొందారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలోని హిందుసేన గణేష్ లడ్డూను మెడికల్ వ్యాపారి సంతోష్ వరుసగా 17వ సారి రూ.1,71,116లకు సొంతం చేసుకున్నారు. సిర్గాపూర్‌లో సాయి గణేష్ యువజన సంఘం ప్రతిష్ఠించిన వినాయకుడి లడ్డూను ప్రవీణ్‌గౌడ్ రూ.లక్ష సొంతం చేసుకున్నాడు.

దుబ్బాకలో ఆదివారం తెల్లవారుజామున వినాయక శోభాయాత్ర సందడి




సంగారెడ్డిలోని మహబూబ్‌సాగర్‌లో చివరి వినాయకుడి నిమజ్జనం


జహీరాబాద్‌లో నారింజ ప్రాజెక్టులో నిమజ్జనమవుతున్న గణపయ్య


దుబ్బాకలో చెరువు కట్ట వద్దకు నిమజ్జనానికి వరుసలో వినాయక వాహనాలు


సిద్దిపేటలో నిమజ్జనం చేయకుండా టార్పాలిన్ కట్టిన మండపం


కోమటిచెరువులో క్రేన్‌లతో గణపతి నిమజ్జనం

సర్కారు బడుల్లో మళ్లీ రాగిజావ

● నేటి నుంచి పంపిణీ షురూ



సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్నా భోజనంతో పాటు మరింత పౌష్టికాహారాన్ని అందించేందుకు గత ప్రభుత్వం రాగిజావ పంపిణీకి శ్రీకారం చుట్టింది. 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పీఎం పోషన్ పథకం ద్వారా రాగిజావ పంపిణీ చేశారు. అయితే, గత విద్యా సంవత్సరం ఏప్రిల్ వరకు విద్యార్థులకు రాగిజావను అందించినప్పటికీ, ఈ విద్యా సంవత్సరం నుంచి మాత్రం అమలుకు నోచుకోలేదు. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం నుంచి అందాల్సిన రాగిపిండి, బెల్లం ప్యాకెట్లు ఇంకా సర్కారు బడులకు సరఫరా కాలేదు. తాజాగా రాగిజావ మళ్లీ పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ నెల 8 వ తేదీన(నేటి)నుంచి రాగి జావ పంపిణీకి చర్యలు తీసుకుంటున్నారు.

రాగిజావ, బెల్లంపొడితో ఎంతో ఉపయుక్తం

గతేడాది విద్యార్థులకు అందజేసిన రాగిజావ, బెల్లం పొడి పంపిణీకి శ్రీసత్య సాయి అన్నపూర్ణ ట్రస్టు చేయూతనిచ్చింది. వారంలో మధ్యాహ్నా భోజనంలో గుడ్లు పెట్టని మూడు రోజుల్లో ప్రతీ విద్యార్థికి 10 గ్రాముల రాగి పొడి, 10 గ్రాముల బెల్లం పొడి కలిపిన జావను అందించారు. సాధారణంగా చాలా మంది పేద పిల్లలు ఉదయం ఖాళీ కడుపుతో పాఠశాలకు వస్తుంటారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారిలో ఎక్కువ మంది అల్పాహారం తీసుకోవడం లేదు. ఫలితంగా వారిలో రక్తహీనత, పోషకాహార లోపం కనిపిస్తుండటంతో పాటు తరగతి గదుల్లో నీరసంగా, అనాసక్తిగా కనిపిస్తున్నారు. చదువుపై కూడా ఏకాగ్రత చూపలేకపోతున్నారు. ఈ సమస్యను నివారించేందుకు ఉదయం విరామ సమయంలో రాగిజావ అందించాలని గతేడాది సర్కారు సంకల్పించింది.

పోతిరెడ్డిపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో

సంగారెడ్డి జిల్లాలో 1215 సర్కారు బడుల్లో 103046 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. రాగిజావ పంపిణీతో విద్యార్థులకు ఎంతో ఎంతో ఉపయుక్తంగా ఉండనున్నది. సోమవారం సంగారెడ్డి చౌరస్తాలోని పోతిరెడ్డిపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో రాగిజావ పంపిణీ ప్రారంభించనున్నారు.

యథేచ్ఛగా ఇసుక రవాణా

● పట్టపగలే ట్రాక్టర్లలో దర్జాగా తరలింపు


మల్లారం శివారులో ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఇసుక

చిన్నకోడూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చిన్నకోడూరు మండలంలో ఇసుక అక్రమ రవాణా నిరాటంకంగా కొనసాగుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా, పట్టపగలే యథేచ్ఛగా ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ముఖ్యంగా మల్లారం గ్రామ శివారులోని వాగు నుంచి నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధికారుల అలసత్వంపై విమర్శలు

వాగుల నుంచి ఇష్టానుసారంగా ఇసుకను తవ్వుతున్నా, దీనిపై చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత అధికారులు, పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల ఇసుకకు డిమాండ్ పెరగడంతో, అక్రమార్కులు ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఈ విధంగా ప్రకృతి సంపదను దోచుకోవడంతో భూగర్భ జలాలు తగ్గిపోయే ప్రమాదం ఉందని, బావులు, బోర్లు ఎండిపోయి వ్యవసాయానికి నీటి సమస్య ఏర్పడుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతున్నారు.

మందుల పిచికారీ.. జాగ్రత్తలు తప్పనిసరి

● చేతికి గ్లౌజులు, ముఖానికి మాస్క్ ధరించాలి

● వ్యవసాయ అధికారుల సలహాలు పాటించాలి



సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో రసాయన మందుల వాడకం విపరీతంగా పెరిగిపోయింది. విత్తనం విత్తినప్పటి నుంచి కోత దశ వరకు రైతులు విచ్చలవిడిగా రసాయన, కలుపు మందులను వాడుతున్నారు. అయితే ఈ మందుల వాడకంలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించకపోతే పంట దిగుబడి తగ్గడంతో పాటు, ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందని వ్యవసాయ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. మోతాదుకు మించి రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకూడదని, వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనల మేరకే వినియోగించాలని సూచిస్తున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు

రసాయన మందులు, కలుపు మందులు స్ప్రే చేసేటప్పుడు రైతులు తప్పనిసరిగా కొన్ని జాగ్రత్తలు పాటించాలని అధికారులు తెలిపారు.

● చేతికి గ్లౌజులు, ముఖానికి మాస్క్ ధరించడం తప్పనిసరి. స్ప్రే చేస్తున్నప్పుడు కళ్లు, ముక్కు, నోటిని చేతులతో తాకడం లేదా రుద్దుకోవడం చేయకూడదు.

● గాలికి ఎదురుగా స్ప్రే చేయకూడదు. మొక్కలకు కింది, పై భాగం పూర్తిగా తడిచేలా స్ప్రే చేయాలి. ఉదయం గాలి లేని సమయం చూసుకుని స్ప్రే చేయడం మంచిది.

● స్ప్రే చేసే సమయంలో సిగరెట్లు, బీడీలు తాగడం లేదా గుట్కాలు తినడం వంటివి ఆరోగ్యానికి హానికరం. స్ప్రే చేయడం పూర్తయిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కున్న తర్వాతే భోజనం చేయాలి.

● రసాయన ఎరువుల డబ్బాలను విచ్చలవిడిగా పడేయకూడదు. అలానే అందుబాటులో ఉండేలా ఎక్కడపడితే అక్కడ నిల్వ ఉంచకూడదు.

● స్ప్రే చేసిన తర్వాత శరీరంపై దద్దుర్లు, కడుపులో నొప్పి, మంట వంటి సమస్యలు వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

అధిక మోతాదు ప్రమాదకరం

కలుపు నివారణ మందులు స్ప్రే చేసిన వెంటనే పురుగుల మందులు స్ప్రే చేయవద్దని అధికారులు తెలిపారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మాత్రమే మోతాదుకు మించకుండా మందులను వాడాలని, అలా చేస్తేనే పంట దిగుబడి మెరుగ్గా ఉంటుందని వారు స్పష్టం చేశారు.

ఆలయాల మూసివేత

● నేటి ఉదయం సంప్రోక్షణ అనంతరం దర్శనాలు



సిద్దిపేట పట్టణంలో ఉమాపార్థివ కోటిలింగేశ్వర ముఖద్వారం మూసివేత, వెల్దుర్తి మండలం బస్వాపూర్‌లో మూసివేసిన మల్లికార్జున స్వామి ఆలయం

సిద్దిపేట/దుబ్బాక/పాపన్నపేట/చిలప్‌చెడ్/నారాయణఖేడ్/గుమ్మడిదల/వెల్దుర్తి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఆదివారం ఉమ్మడి మెదక్ జిల్లాల్లోని ఆలయాలను మూసివేశారు. సిద్దిపేటలోని శ్రీఉమాపార్థివ కోటి లింగేశ్వరాలయం, శ్రీశరభేశ్వరాలయం, వీరహనుమాన్, వెంకటేశ్వరాలయం, సంతోషిమాత ఆలయాలను మధ్యాహ్నం నుంచి మూసివేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. దుబ్బాకలోని వీరాంజనేయ, నీలకంఠేశ్వర, మార్కండేయ, కేదారీశ్వర, బాలాజీ వేంకటేశ్వర, రేణుకాదేవి ఆలయాలకు తాళాలు వేశారు. మెదక్ జిల్లా ఏడుపాయలలో రాజగోపుర ఆవరణలోని అమ్మవారికి ఆదివారం మధ్యాహ్నం హారతినిచ్చి దర్శనాన్ని నిలిపివేశారు. చిలప్‌చెడ్ మండల పరిధి చిట్కుల్‌లోని చాముండేశ్వరిలో పూజల అనంతరం అర్చకులు ఆలయాన్ని మూసివేశారు. వెల్దుర్తిలోని బస్వాపూర్ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం, మన్నెవారి జలాల్‌పూర్ కళామాత ఆలయాల గేట్లను వేశారు. సంగారెడ్డి జిల్లా మనూరు మండలంలోని బోరంచ పోచమ్మ ఆలయం, గుమ్మడిదల వీరభద్రస్వామి దేవస్థానంను మూసివేశారు. చంద్రగ్రహణం ముగిసిన తర్వాత సోమవారం ఉదయం ఆలయాలను శుభ్రం చేసి, సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం భక్తులకు తిరిగి దర్శనం కల్పించనున్నట్లు ఆయా ఆలయాధికారులు, అర్చకులు తెలిపారు. భక్తులు ఈ విషయాలను గమనించి సహకరించాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

కల్తీ దందా

పామాయిల్, పౌడర్‌తో కృత్రిమ పాల తయారీ

స్వచ్ఛతకు మారుపేరుగా భావించే పాలను కల్తీ చేస్తూ కొందరు స్వార్థపరులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. హైదరాబాద్, పటాన్‌చెరు, సంగారెడ్డి, జోగిపేట వంటి పట్టణ ప్రాంతాలకు పామాయిల్, టేస్టింగ్ పౌడర్‌తో తయారు చేసిన కృత్రిమ పాలు, నెయ్యిని వేల లీటర్ల మేర సరఫరా చేస్తున్నారు. పోలీసులు దాడులు నిర్వహించి కల్తీ వ్యాపారులను అరెస్టు చేసినా, జైలు నుంచి తిరిగి వచ్చి మళ్లీ అదే దందా కొనసాగిస్తున్నారు.

- పోలీసుల దాడుల్లో గుట్టురట్టు
- జైలుకెళ్లినా తీరు మార్చుకోని నిందితులు
- తిరిగి కల్తీ పాలు, నెయ్యి తయారీ మొదలు


పోలీసులు స్వాధీనం చేసుకున్న కృత్రిమంగా తయారు చేసిన నెయ్యి డబ్బాలు (ఫైల్)

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): హత్నూర మండలం గోవిందరాజ్‌పల్లి గ్రామంలోని మధుప్రియ డెయిరీ యజమానులు బొమ్మ శంకరయ్య, అతని కుమారుడు బొమ్మ రాఘవేందర్ కృత్రిమ పాలు, నెయ్యి తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పేరుకు డెయిరీ అయినా, లోపల ఉండేది పదుల సంఖ్యలోనే ఆవులు, బర్రెలు మాత్రమే. 200 లీటర్ల పాలతో 2500 లీటర్ల కల్తీ పాలను తయారు చేసి పటాన్‌చెరు, సంగారెడ్డి, మెదక్ వంటి ప్రాంతాలకు సరఫరా చేసేవారు. గత సంవత్సరం ఏప్రిల్ 3న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి, శంకరయ్య, రాఘవేందర్‌లను అరెస్టు చేసి జైలుకు పంపారు. అయితే బెయిల్‌పై బయటకు వచ్చిన రాఘవేందర్ తన పద్ధతిని మార్చుకోలేదు. మళ్లీ కల్తీ పాల తయారీని ప్రారంభించాడు. తాజాగా కల్తీ నెయ్యిని కూడా చేయడం మొదలు పెట్టాడు.

కల్తీ నెయ్యి తయారీ, అమ్మకాలు

తాజాగా ఆగస్టు 30న టాస్క్‌ఫోర్స్ పోలీసులు మళ్లీ దాడులు చేసి కల్తీ నెయ్యి తయారీని గుట్టురట్టు చేశారు. పామాయిల్ ప్యాకెట్లు, కల్తీ నెయ్యి, పాల తయారీకి ఉపయోగించే ముడి పదార్థాలను భారీగా స్వాధీనం చేసుకున్నారు. సరఫరాకు సిద్ధంగా ఉంచిన 16 డబ్బాల్లో ఉన్న 210 లీటర్ల కల్తీ నెయ్యిని స్వాధీనం చేసుకున్నారు. ఈ నెయ్యిని హైదరాబాద్, పటాన్‌చెరు, సంగారెడ్డి వంటి ప్రాంతాలకు తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితులను మరోసారి అదుపులోకి తీసుకొని జైలుకు పంపారు.


కృత్రిమ పాలు తయారు చేయడానికి ఉపయోగించే ముడి పదార్థాలు (ఫైల్)

పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తాం



ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే కల్తీ వ్యాపారులపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తాం. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఎంతటివారైనా శిక్షార్హులే. కల్తీ వ్యాపారాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలి. లేదా డయల్ 100కు కాల్ చేయండి.

- పరితోష్ పంకజ్, సంగారెడ్డి ఎస్పీ

న్యూస్ బాక్స్

ధ్యానంతో శాంతి

చేగుంట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ధ్యానం వ్యక్తిగత, ప్రపంచ శాంతికి తోడ్పడుతుందని హార్ట్ ఫుల్‌నెస్ ప్రతినిధి రామ్ నివాజీ అన్నారు. ఆదివారం ఉదయం 8 గంటలకు చేగుంట వేంకటేశ్వర ఆలయంలో సామూహిక ధ్యానం చేపట్టి మాట్లాడారు. ధ్యానం వల్ల మానసికోల్లాసంతో పాటు ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హార్ట్ ఫుల్‌నెస్ సభ్యులు రష్మి పాండే, కేవీవీఎన్ పద్మావతి, ఆదిశేషు, చేగుంట గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు ప్రజాప్రతినిధులతో సమావేశం

జహీరాబాద్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ముసాయిదా ఓటర్ల జాబితాపై వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులతో సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో మహేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సమావేశంలో పోలింగ్‌స్టేషన్లు, ఓటరు జాబితా, తదితరాలపై చర్చిస్తామన్నారు. అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షుడిగా వినోద్‌కుమార్

టేక్మాల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : టేక్మాల్ మండల పరిధిలోని బొడ్మెట్‌పల్లి వీరశైవ లింగాయత్ సమాజం కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉప్పు వినోద్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా పట్ల సాయి ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ముద్దపురం నాగప్ప, సహాయ కార్యదర్శిగా ఉప్పు నరసప్ప, కోశాధికారిగా గంటగారి ఈశ్వరప్ప, కార్యవర్గ సభ్యులుగా ఉప్పు ఆనంద్‌కుమార్, ఉప్పు అరవింద్, ముద్దాపురం మల్లేషం, ముద్దాపురం రవి, శ్రావణ్, వీరప్ప, శరణప్ప, సందీప్, శివకుమార్, చంద్రప్ప, సందీప్, వీరయ్య, రాజు, రజిత, యశ్వంత్, బస్వారాజ్, రవీందర్, శ్రావణ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యులకు సన్మానం

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యులుగా ఎన్నికైన బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్‌పాటిల్, న్యాయవాది నర్సింగ్‌రావును బీసీ సంఘం నాయకులు ఆదివారం సంగారెడ్డిలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రభుగౌడ్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌స్వామి, ముఖ్య సలహాదారుడు చంద్రయ్య స్వామి, నాయకులు అశోక్‌బాబు, శ్రీనివాస్, పాండురంగం, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో సమస్యలు పరిష్కరించాలి

నారాయణఖేడ్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ పట్టణంలోని ముస్లిం శ్మశాన వాటికలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు మోహీద్‌పటేల్ కోరారు. ఆదివారం ముస్లిం శ్మశాన వాటికను సందర్శించి మాట్లాడారు. శ్మశాన వాటికలో చెట్లను కొట్టివేసి సమాధులపై ఇష్టమొచ్చినట్లు పారేస్తున్నారన్నారు. శ్మశాన వాటికలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సబ్ కలెక్టర్‌ను, మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. ఆయన వెంట స్థానిక నాయకులు అహ్మద్ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

పటాన్‌చెరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డ్యూటీకి వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పరిధిలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సీమ భర్త రాముతో కలిసి ఇస్నాపూర్‌లో నివాసం ఉంటున్నది. పాశమైలారం పారిశ్రామికవాడ అల్వా పరిశ్రమలో ఆమె పని చేస్తున్నది. ఈ నెల 4వ తేదీన డ్యూటీకి వెళ్లిన సీమ తిరిగి ఇంటికి రాలేదు. భర్త రాము తెలిసిన వారి వద్ద, చుట్టుపక్కల ప్రాంతాల్లో విచారించారు. ఫలితం లేకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

కొండపాక , సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను పరిష్కరించడం కోసం భారతీయ కిసాన్‌సంఘ్ నిరంతర కృషి చేస్తుందని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పన్యాల వెంకటరెడ్డి పేర్కొన్నాడు. ఆదివారం మండలంలోని దుద్దెడ రైతు వేదికలో మండల అధ్యక్షుడు పరశురాములు ఆధ్వర్యంలో మండలస్థాయి భారతీయ కిసాన్ సభ్యుల శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న ప్రతీ సమస్యపై రైతులకు అవగాహన కల్పించి సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. సిద్ధాంతాలు, సమస్యల పట్ల అవగాహన కలిగి ఉండాలనే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ సమస్య విత్తనాల సమస్య, రైతుల సమస్యల పట్ల ముందుండి భారతీయ కిసాన్ సంఘంపోరాడుతుందని తెలిపారు.




వెల్దుర్తిలో కోతుల సమూహం, నర్సాపూర్‌లో ఓ వీధిలో వానర మూక సంచారం

బాబోయ్.. కోతులు

- ఇళ్లలో చొరబడి ఆగమాగం చేస్తున్న వానరాలు
- బెంబేలెత్తుతున్న ప్రజలు
- బయటకు వెళ్లలేని పరిస్థితి
- పట్టించుకోని అధికారులు, నాయకులు

వెల్దుర్తి/నర్సాపూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో కోతుల బెడద రోజురోజుకు పెరిగిపోతోంది. ఇళ్లలోకి చొరబడి దొరికిన కాడికి ఎత్తుకెళ్లి హంగామా సృష్టిస్తున్నాయి. ఇళ్ల కప్పులపై ఎగురుతూ పెంకులను పగులగొడుతున్నాయి. ఇళ్లలోకి ప్రవేశించి పిల్లలను, మహిళలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇంట్లోకి చొరబడి బియ్యం, పప్పులతో పాటు వంటపాత్రలు, తినే పదార్థాలను ఎత్తుకెళ్తున్నాయి. అలాగే ఇంటిపై ఉండే కేబుల్, నెట్ వైర్లను సైతం తెంపేస్తున్నాయి. ఎవరైనా బెదిరిస్తే ఎగబడి కరుస్తూ తీవ్రంగా గాయపరుస్తున్నాయి. దీంతో రోడ్డు, వీధుల వెంట నడవాలంటేనే ప్రజలు జంకుతున్నారు. పదుల సంఖ్యలో ఉన్న కోతులు నేడు వందల సంఖ్యలోకి చేరుకున్నాయి. బండ్లపై పండ్లు, కూరగాయలు విక్రయించే వ్యాపారుల పరిస్థితి కూడా దారుణంగా ఉంది. బండ్లపై ఎగబడి పండ్లను, కూరగాయలను ఎత్తుకెళ్తున్నాయి. అలాగే నర్సాపూర్ పట్టణంలో ఏ వీధిలో చూసినా కుక్కలు, కోతులే దర్శనమిస్తున్నాయి. ఇళ్లమధ్యనే సంచరిస్తూ చేతిలో చిన్న కవర్ కనిపించినా లాక్కుంటున్నాయని పట్టణవాసులు పేర్కొంటున్నారు. పలుమార్లు కోతుల, కుక్కల దాడిలో గాయాలకు గురైన ఘటనలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కలు, కోతుల బెడద నుంచి కాపాడాలని ప్రజలు వేడుకుంటున్నారు.

కోతుల బెడదను నివారించాలి



వెల్దుర్తి మండలంలో కోతుల బెడద లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలి. ఒకేసారి పదుల సంఖ్యలో వస్తూ ఇంటి తలుపులు తీసుకుని ఇళ్లలోకి చొరబడుతున్నాయి. కూరగాయలు పండ్లు, ఇతర వస్తువులను తీసుకెళ్తున్నాయి. ప్రజలు, చిన్నారులు ఇళ్లలో నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. అధికారులు స్పందించి కోతుల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

\- గొంది బాలయ్య, వెల్దుర్తి

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్ : సంజీవరెడ్డి

నారాయణఖేడ్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సీఎంఆర్‌ఎఫ్ పథకం పేదలకు వరమని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం ఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో ఖేడ్, నిజాంపేట్,కంగ్టి, మనూరు, నాగల్‌గిద్ద, కల్హేర్ మండలాలకు సంబంధించిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఖేడ్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, కల్హేర్ మాజీ ఎంపీపీ మల్లేశం, పార్టీ నిజాంపేట మండల అధ్యక్షుడు శంకర్‌గౌడ్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ రాధాక్రిష్ణ, సేవాలాల్ సంఘం రాష్ట్ర నాయకుడు రమేష్‌చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.



క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

ఉపాధ్యాయుడి నుంచి పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎదిగిన లక్ష్మణ్

నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన గుండు లక్ష్మణ్ సాధారణ ఉపాధ్యాయుడి నుంచి పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడి వరకు ఎదిగాడని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం నారాయణఖేడ్‌లో ఏర్పాటు చేసిన లక్ష్మణ్ ఉద్యోగ విరమణ సభలో మాట్లాడుతూ కష్టపడి పని చేయడం వల్లే ఈ స్థాయికి ఎదిగాడన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్ రెడ్డి, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు శేరి వెంకట్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అయ్యప్ప మాణయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, మాజీ సీడీసీ చైర్మన్ నర్సింహారెడ్డి, సేవాలాల్ సంఘం రాష్ట్ర నాయకుడు రమేష్‌చౌహాన్ పాల్గొన్నారు. అనంతరం టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సిద్ధారెడ్డి, జాదవ్‌నారాయణ, న్యాయవాది బోజిరెడ్డి, శంకర్ ముదిరాజ్, తదితరులు ఆయనను సన్మానించారు.

పేదలకు సేవ చేయడం సంతోషం

- సూపరింటెండెంట్ చంద్రశేఖర్



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

మెదక్, కల్చరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పేదలకు సేవ చేయడం ఆనందంగా ఉన్నదని సూపరింటెండెంట్ చంద్రశేఖర్ అన్నారు. మెదక్ జిల్లా ఆస్పత్రిలో 25 ఏళ్లుగా విధులు నిర్వర్తించి, ఇటీవలే కొండాపూర్ సూపరింటెండెంట్‌గా వెళ్లిన చంద్రశేఖర్ గతనెలలో ఉద్యోగ విరమణ పొందారు. కాగా ఆదివారం మెదక్ జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వర గార్డెన్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉత్తమ సేవలందిస్తేనే ఎల్లకాలం గుర్తుండిపోతాయన్నారు. డాక్టర్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న చంద్రశేఖర్ ప్రజలకు ఎన్నో సేవలను అందించారని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇఫ్కో మాజీ డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున గౌడ్, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం ఎంతో గొప్పది : ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

గుమ్మడిదల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అన్ని దానాల్లో కెల్లా రక్తదానం ఎంతో గొప్పదని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని గుమ్మడిదల మున్సిపల్ పరిధిలో ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో వాయిస్ ఆఫ్ ముస్లిం యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మిలాద్ మెగా బ్లడ్ క్యాంపును ఆదివారం ఉదయం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఐదేళ్లుగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం గొప్ప విషయమని నిర్వాహకులను అభినందించారు. అలాగే రక్తదాన శిబిరాన్ని సీజీఆర్ ట్రస్టు చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి సందర్శించారు. ఈ కార్యక్రమంలో గుమ్మడిదల మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, సీనియర్ నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, షేక్ హుస్సేన్, సీఐ నయీముద్దీన్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మహిపాల్‌రెడ్డి

ఒకేషనల్, జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు మహేష్



సమావేశంలో మాట్లాడుతున్న మహేష్

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అనుమతులు లేని ఒకేషనల్, జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు మహేష్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఒకేషనల్, జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. విద్యాశాఖ అధికారి నిర్లక్ష్యం వల్ల జిల్లాలో అనేక రకాల పేర్లతో ఒకేషనల్, జూనియర్ కళాశాలలు వెళ్తున్నాయని, వెంటనే ఇంటర్మీడియేట్ జిల్లా అధికారి గోవింద్‌రామ్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్‌ఎఫ్ఐ నాయకులు శంకర్, పావని, సునీత, మార్కస్, విష్ణువర్ధన్, శ్రావణ్, సబిత తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టుల పనులు వేగవంతం చేయండి

- మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి

నిజాంపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇటీవలి వరదలకు కొట్టుకుపోయిన కల్వర్టుల నిర్మాణం చేపట్టి రవాణా సౌకర్యం మెరుగుపర్చాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆమె నిజాంపేట మండల పరిధి తిప్పనగుళ్లలో హైదర్ చెరువుకు ఉన్న మల్లన్నసాగర్ కాలువను పరిశీలించి, విలేకరులతో మాట్లాడారు. చెరువు గండి పూడ్చకపోతే చుక్కనీరూ మిగలదన్నారు. దీనిపై ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం ఎందుకంటూ ప్రశ్నించారు. నిజాంపేట నస్కల్‌తో పాటు, నందిగామ శివారులో రామాయంపేట వెళ్లే కల్వర్టుల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. ఓవైపు పల్లె జనం పట్టణాలకు వెళ్లేందుకు రోడ్లు తెగి తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని చెప్పారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలన్నారు. అనంతరం తిప్పనగుళ్లకు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు రెడ్డిశెట్టి రవీందర్ తల్లి మృతిచెందగా.. ఆమె అంత్యక్రియల్లో పద్మారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కంటారెడ్డి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, చింతల స్వామి, కొండల్‌రెడ్డి, అబ్దుల్ అజీజ్, రంజిత్ పాల్గొన్నారు.



కొట్టుకుపోయిన మల్లన్నసాగర్ కాలువను పరిశీలిస్తున్న పద్మారెడ్డి

కొడకంచిలో బస్టాండ్ ప్రారంభం

జిన్నారం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని కొడకంచిలో నూతనంగా ఏర్పాటు చేసిన బస్టాండ్‌ను విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి రాములుచే గ్రామ నాయకులు ప్రారంభం చేశారు. స్థానికులు, ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్‌ను ఏర్పాటు చేసినట్లు మాజీ సర్పంచ్ శివరాజ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డే కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అభిలాష్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

తూప్రాన్/సంగారెడ్డి అర్బన్/కంది/రామాయంపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ మండలం కిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు ధనలక్ష్మి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆదివారం లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320-డీ ఆధ్వర్యంలో దిల్‌సే గురు వందం పేరుతో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. తూప్రాన్ లయన్స్‌క్లబ్ తరఫున ధనలక్ష్మిని ఎంపిక చేసి నామినేట్ చేశారు. ఎంపిక చేసిన క్లబ్ అధ్యక్షుడు పల్లెర్ల రవీందర్‌గుప్తా, సెక్రటరీ సీఆర్ జానకీరాం, ఎంఈవో డాక్టర్ పర్వతి సత్యనారాయణకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. అలాగే సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం వెల్టూర్ ఎంపీపీఎస్ ఉపాధ్యాయుడు పత్తిగారి మల్లికార్జున్‌గౌడ్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును రవీంద్రభారతిలో అందుకున్నారు. కంది మండలం ఎద్దుమైలారం ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో జోగప్పను హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మాజీ ఐఏఎస్ కే.లక్ష్మీనారాయణ జోగప్పను సన్మానించారు. రామాయంపేట ప్రాంతానికి చెందిన నార్సింగి మండల పరిధి జప్తి శివనూర్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న కవితను జిల్లా లయన్స్ వైస్ గవర్నర్‌విజయలక్ష్మి చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకున్నది.

ఎంపీడీవో, ఎంపీవోలపై చర్యలు తీసుకోండి

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ కార్మికులపై దాడి చేసిన ఎంపీడీవో, ఎంపీవోలపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ.సాయిలు డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కంగ్టి మండలంలో గ్రామపంచాయతీ కార్మికులు మూడు నెలల బకాయి వేతనాలు, సబ్బులు, నూనెలు, బెల్లం ఇతర సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలిపి ఎంపీడీవో, ఎంపీవోల వద్దకు వెళ్లగా.. జీతాలు లేవు, ఏమి లేవు. ఇష్టముంటే చేయండి లేకుంటే వెళ్లిపోండని దురుసుగా సమాధానమిస్తూ మహిళా కార్మికులపై దాడిచేసి బయటికి గెంటివేయడం దుర్మార్గమన్నారు. ఘటన జరిగి రెండు రోజులైనా వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తయ్య, దశరథ్, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాయిలు

కాంట్రాక్ట్ కార్మికులకు సౌకర్యాలు కల్పించాలి : సీఐటీయూ

కొండాపూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కాంట్రాక్ కార్మికులకు పెరిగిన నిత్యాసర వస్తువుల ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు పెంచాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని సీఐటీయూ కాంట్రాక్ట్ కార్మికుల జిల్లా అధ్యక్షుడు మాణిక్ డిమాండ్ చేశారు. ఆదివారం గొల్లపల్లి శివారులోని సిసాల పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సీఐటీయూ నాయకులు ఆరాతీశారు. ఈ సందర్భంగా మాణిక్ మాట్లాడుతూ సిసాల పరిశ్రమలో కార్మికులు ప్రమాదకర పరిస్థితిలో పనిచేస్తున్నారని, ఐదారేళ్లుగా పనిచేస్తున్నా పనికి తగ్గ వేతనం వేతనం ఇవ్వకుండా వెట్టిచాకిరీ చేయిస్తున్నారని ఆరోపించారు. ఆయన వెంట సీపీఎం మండల కార్యదర్శి రాజయ్య, సీఐటీయూ నాయకులు బాబురావు, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

ధాన్యం బకాయిలు రూ.175 కోట్లు

(3వ పేజీ తరువాయి)

ఉన్నాయి. ఇటీవల మంత్రివర్గ తీర్మానం నేపథ్యంలో అప్రమత్తమైన పౌర సరఫరాల అధికారులు బకాయి ఉన్న ధాన్యం విలువ రూ. 175.80 కోట్లు అని జిల్లా పౌరసరఫరాలశాఖ కమిషనర్‌కు పంపిన నివేదికలో పేర్కొన్నారు. ఇప్పటికే ఆ ధాన్యం బాపతు డబ్బుల్ని రైతులకు ప్రభుత్వం చెల్లించింది. మిల్లర్లు మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రభుత్వ వర్గాలు ఆరోపిస్తున్నాయి. మూడువారాల లోపు బకాయిలు చెల్లించని మిల్లర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది.

మూడుసార్లు నోటీసులు

రైస్ మిల్లర్లకు 2022-23 యాసంగి సీజన్‌కు సంబంధించి పెండింగ్ ధాన్యం ఇవ్వాలని మూడుసార్లు నోటీసులు ఇచ్చినట్లు డీఎం జగదీష్ తెలిపారు. గత జూన్ నెలలో మూడో దఫా జిల్లాలోని 72 రైస్ మిల్లులకు నోటీసులు జారీ చేశామని వివరించారు. ప్రస్తుతం మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ ధాన్యం రికవరీ చెర్యలపై త్వరలోనే జీవో వెలువడనుందని వెల్లడించారు. ప్రభుత్వం క్వింటాలు ధాన్యానికి రూ.1,960 ధర నిర్ణయించిందన్నారు. మన జిల్లాలో మిల్లర్లు రూ.175 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.

మత్స్య సంఘాల డిజిటలైజేషన్

(3వ పేజీ తరువాయి)

సౌకర్యం కల్పించారు. ఇప్పటికే మత్స్య సహకార సంఘాల్లో నమోదైన వారికి మాత్రమే రిజిస్ట్రేషన్ సౌకర్యాన్ని కల్పించగా, సభ్యులు తమ పూర్తి వివరాలను నమోదు చేసుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న మత్స్యకారులకు కేంద్ర ప్రభుత్వ జాతీయ మత్స్యశాఖ అభివృద్ధి బోర్డు ద్వారా సర్టిఫికెట్లను అందించనున్నాయి.

కరాటేతో స్వీయ రక్షణ



కరాటే పోటీలు ప్రారంభించిన నీలం మధు

పటాన్‌చెరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్వీయ రక్షణకు కరాటే శిక్షణ ప్రయోజనకరంగా మారుతుందని కాంగ్రెస్ నాయకుడు నీలం మధు అన్నారు. ఆదివారం శంకరపల్లి మండలం మోకిల గ్రామంలో సక్సెస్ శోభోకాన్ కరాటే 2025 రాష్ట్ర ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆత్మరక్షణతో పాటు విద్య, వ్యాయామం వంటి అంశాలుగా ప్రయోజనకరంగా మారుతుందని వివరించారు. మారుతున్న పరిస్థితులను బట్టి అమ్మాయిలు తప్పనిసరిగా నేర్చుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయంలో చండీహోమం

గుమ్మడిదల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పౌర్ణమి సందర్భంగా గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి వీరన్నగూడెం గ్రామంలోని ప్రసిద్ధ వీరభద్రస్వామి దేవస్థానంలో ఆదివారం చండీహోమం ఘనంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై వీరభద్రస్వామి, అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదం స్వీకరించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మద్ది ప్రతాప్‌రెడ్డి, ధర్మకర్త అశోక్‌గౌడ్, పర్యవేక్షకుడు సోమయ్య పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలిగా స్వప్నశ్రీ



స్వప్నశ్రీ

మాసాయిపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మాసాయిపేట మండలం చెట్లతిమ్మాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో హిందీ బోధిస్తున్న పాతూరి స్వప్నశ్రీ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. శనివారం కలెక్టర్, ఎమ్మెల్సీల చేతులమీదుగా అవార్డును సైతం అందుకున్న విషయం తెలిసిందే. స్వప్నశ్రీ కేవలం ఉపాధ్యాయురాలుగా కాకుండా విద్యార్థుల మానసిక పరిపక్వతకు అనుగుణంగా ఉదాహరణలతో విద్యాబోధన చేస్తూ ఉత్సాహ పరుస్తోంది. తిమ్మాయిపల్లిలో గ్రామస్థులు నిర్వహించే పలు కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రశంసలు పొందుతోంది. ఈ అవార్డు రావడానికి సహకరించిన తోటి ఉపాధ్యాయులకు, గ్రామస్థులకు స్వప్నశ్రీ కృతజ్ఞతలు తెలిపారు.

నడిమితండాలో వైద్య శిబిరం



ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మాసాయిపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మాసాయిపేట మండలం చెట్లతిమ్మాయిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని నడిమితండాలో చేగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అనిల్ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అలాగే తండాలోని పలువురి ఇళ్లను సందర్శించి జ్వరాల బారినపడిన వారి శాంపిల్స్ సేకరించి మెదక్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు డాక్టర్ అనిల్ తెలిపారు.

రోడ్డు నిర్మించాలంటూ కాలనీవాసుల ధర్నా



పాటి గ్రామ రహదారిపై ధర్నా చేస్తున్న కాలనీవాసులు

రామచంద్రాపురం టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు గుంతలుగా ఉండటం వల్ల నిత్యం ప్రమాదాల బారినపడుతున్నామని తెల్లాపూర్ పురపాలక పరిధి పాటి గ్రామానికి చెందిన కాలనీవాసులు చెప్పారు. ఆదివారం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపి మాట్లాడారు. పాఠశాల బస్సులు గుంతల్లోంచి వెళ్లడం వల్ల బస్సులోనే పడి గాయాల పాలవుతున్నారని తెలిపారు. దీనిపై అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని అన్నారు.

ప్రజాసేవే లక్ష్యం : చంద్రశేఖర్

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసేవే తన లక్ష్యమని ఎన్నారై, ప్రజా సేవకుడు కంజర్ల చంద్రశేఖర్ పేర్కొన్నారు. చిన్నశంకరంపేట మండల కేంద్రానికి చెందిన చంద్రశేఖర్ 15 ఏళ్లుగా అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. గతంలో చంద్రశేఖర్ తాతయ్య దివంగత శంకరప్ప సర్పంచ్‌గా పనిచేసి గ్రామాభివృద్ధికి తోడ్పడ్డాడు. తాతయ్య అడుగు జాడల్లో నడుస్తూ ప్రజాసేవ చేస్తూ ముందుకు సాగుతున్నారు చంద్రశేఖర్. గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో అమెరికాలో ఉన్నతమైన ఉద్యోగాన్ని సైతం వదులుకుని గ్రామానికి వచ్చి ప్రజలకు సేవలందిస్తున్నారు.